క్లుప్తంగా

గ్రీవెన్స్‌కు నాలుగు అర్జీలు



పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న ఏఓ మాధవరావు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికై ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు తెలిపారు. వారం వారం నిర్వహించే గ్రీవెన్స్‌లో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి నాలుగు అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఏఓ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కంచరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించినట్టు మాధవరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణ శాఖ అధికారి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

తీరంలో పడవల గణన



మత్స్యకారుల వివరాలను నమోదు చేస్తున్న అధికారులు

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ శివారు రామన్నపాలెంలో ఉన్న ఉప్పుటేరు వద్ద సోమవారం మత్స్యకార బోట్లు గణనను మత్స్యశాఖ అధికారులు నిర్వహించారు. బోట్లలో పనిచేసే సిబ్బంది వివరాలను మత్స్యశాఖ అధికారి శ్రీరామకృష్ణ ఆధ్వర్యంలో బోట్లు వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేట నిషేధ సమయంలో ప్రభుత్వం అందించే మత్స్యకార భరోసా పొందాలంటే ఈ లెక్కింపు తప్పని సరి అన్నారు. మండలంలో ఉన్న 1253 బోట్లలో 7,518 మంది సంబంధించిన మత్స్యకారుల వివరాలను నమోదు చేయనున్నట్లు ఆయన తెలపారు. ఈ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్టు తెలిపారు. మత్స్యకారులు తప్పనిసరిగా వేట నిషేధాన్ని పాటించాలన్నారు.

'భోజనం' కార్మికుల ఉపాధి పోగొట్టవద్దు



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పెద్దాపురం: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ఉపాధి కొట్టే విధంగా వ్యవహరించవద్దని ఏపీ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం సీఐటీయూ విజ్ఞప్తి చేసింది.మధ్యాహ్న భోజన కార్మికులు పొట్టకొట్టే విధంగా ప్రభుత్వ చర్యలు తగవని సోమవారం ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు గడిగట్ల సత్తిబాబు, సంఘం నాయకులు సుబ్బలక్ష్మి తదితరులు మాట్లాడుతూ ఉపాధి తీసేసే విధంగా కాకుండా మధ్యాహ్న భోజన పథకం కార్మికులను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాడి సత్యవతి, లక్ష్మి, నీలపాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

పిఠాపురం: అనుమతులు లేకుండా తరలిస్తున్న నాలుగు గ్రావెల్ ట్రాక్టర్లను ఆదివారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో చేబ్రోలు వీఆర్వోకు వచ్చిన సమాచారం మేరకు చేబ్రోలు నుంచి దుర్గాడ వెళ్లే శ్మశానం రోడ్డులో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను గొల్లప్రోలు పోలీసు సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఈ ట్రాక్టర్ల డ్రైవర్లు పడాల మంజునాథ, పడాల వెంకటేశ్వరరావు, కందా నారాయణమూర్తి, గంట వెంకటరమణలను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయాన్ని మైనింగ్, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వచ్చే నెల 3న త్యాగరాయ జయంత్యుత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యకళామందిరంలో మే 3న త్యాగరాజస్వామి జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సరస్వతీ గాన సభ కార్యవర్గ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలు నుంచి రాత్రి 9 గంటలు వరకూ అఖండ గానం నిర్వహించనున్నట్టు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 4.30 వరకూ నాదస్వరం. ఐదు గంటల నుంచి స్థానిక కళాకారుల పంచరత్నసేవ జరుగుతుందన్నారు.

మురికిపాలిటీ..!

- పిఠాపురంలో పరిస్థితి అధ్వానం
- ముక్కుపుటాలు అదిరిపోయేలా డ్రైన్లు
- ఫిర్యాదులకు స్పందించని అధికారులు

పిఠాపురం: 'చెత్త చెత్త కాదు. సద్వినియోగించుకుంటే ఎంతో ఉపయోగం' మున్సిపల్ అధికారులకు ఫోన్ చేస్తే వినిపించే రింగ్‌టోన్ ఇది. పారిశుధ్యం మెరుగుకు మాత్రం మున్సిపాలిటీ అధికారులు ఏ చర్యా తీసుకోరు. ప్రజలు నిత్యం ఫిర్యాదులు చేస్తున్నా వాటి వైపు కన్నెత్తి చూడరు. పేరుకు పిఠాపురం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గ కేంద్రం. కాని దీనిని మున్సిపల్ అధికారులు మురికిపురంగా మార్చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్న డ్రైన్లు మూసుకుపోయాయి. డ్రైన్ల అవుట్‌లెట్లు కబ్జాలకు గురయ్యాయి. కాని మున్సిపల్ అధికారులు అందినంతా దోచుకుని డ్రైన్లను పట్టించుకోడం మానేసారని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. ఏటా సుమారు రూ.3 కోట్లు ఖర్చు చేస్తున్నా పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది.

పట్టణంలో అన్ని వార్డుల్లో పారిశుధ్యం క్షీణించింది. ప్రజలు మాత్రం తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

రోజుకు 28 టన్నుల చెత్త

19.57 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో ఉన్న మున్సిపాలిటీలో 30 వార్డులు ఉన్నాయి. సుమారు 75 వేల మంది జనాభా నివసిస్తున్నారు. రోజుకు 28 టన్నుల చెత్త పట్టణంలో పోగవుతున్నట్టు అంచనా. ఈ చెత్తలో సగానికి పైగా డ్రెయిన్లలోనే ఉంటోంది. పట్టణంలో ఎక్కడ చూసినా డ్రైన్ల నిండా చెత్త నిండి దుర్వాసన, దుర్గంధం వెదజల్లుతూ, అంటురోగాల భయంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. చెత్త తొలగించేందుకే మున్సిపాలిటీ ఏడాదికి సుమారు రూ.3 కోట్లు ఖర్చు చేస్తోంది. ప్రైవేటు శానిటేషన్ సిబ్బంది, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, వాహనాల కొనుగోలు, సామగ్రి కోసం ఖర్చు పెడుతున్నారు. చెత్త సేకరణకు వంద మందికి పైగా సిబ్బంది ఉన్నారు. పట్టణంలోని ఇరుకు సందుల్లో చెత్త పేరుకుపోతోంది. ముఖ్యంగా డ్రైవర్స్ కాలనీ, గోర్స రోడ్డులోని ఏడు కాలువలు, అగ్రహారంలోని ఇరుకు సందులు, జగ్గయ్యచెరువు, కత్తులగూడెం, కొండప్పవీధి, మంగయ్యమ్మరావుపేట, విద్యుత్‌నగర్, సకలయ్యచెరువు, సీతయ్యగారితోట తదితర ప్రాంతాల్లో చెత్త తొలగింపు అంతంత మాత్రమే. దీంతో ఆయా ప్రాంతాలు మురికికూపాలుగా మారి, మురుగు నీరు బయటకు వెళ్లకుండా రోడ్లపై ప్రవహిస్తూ ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం.

ఫిర్యాదుల వెల్లువ

పట్టణంలో పారిశుధ్య లోపంపై ప్రజలు నిత్యం అధికారులకు ఫిర్యాదులు ఇస్తునే ఉన్నారు. ఇటీవల పిఠాపురంలో ఏర్పాటు చేసిన పాడా కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సైతం ప్రతి వారం ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. చివరకు జనసేన నేతలను మురికి ప్రాంతాలకు తీసుకెళ్లి పరిస్థితిని చూపించి మరీ ఫిర్యాదులు చేశారు. అయినా ఏ ఒక్క అధికారీ పట్టించుకున్న దాఖలాలు లేక చివరకు సోమవారం మళ్లీ పాడా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.



మురికికూపంగా కొండప్పవీధి ప్రాంతం



కోటసత్తెమ్మ తల్లి ఆలయం వద్ద



పాడా కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్ ముమ్మిడి వెంకటలక్ష్మి రత్న సుజిత

ఆరు నెలల నుంచి ఇదే పరిస్థితి

వీధుల్లోని డ్రైన్లలో చెత్త వల్ల సమస్యలు వస్తున్నాయి. ఆరు నెలలుగా మా ప్రాంతంలో డ్రైన్లలో చెత్త తీయడం మానేసారు. దీంతో మురుగు నీరు రోడ్లపై పారి పరసరాలు మురుగు కూపాలుగా మారుతున్నాయి. డ్రైన్ల అవుట్‌లెట్లు మూతపడినా అధికారులు పట్టించుకోడం లేదు. ఎన్నోసార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేశాం. ఎవరూ అటువైపు చూడడం లేదు. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయి. ప్రజల ఆరోగ్యంతో అధికారుల ఆటలాడుకోవడం తగదు.

– ముమ్మిడి వెంకటలక్ష్మి రత్న సుజిత, కౌన్సిలర్, 25వ వార్డు, పిఠాపురం

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని కుమారా రామ భీమేశ్వరస్వామి

సామర్లకోట స్థానిక పంచారామ క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉప ఆలయాలోను ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి స్వామి వారిని అమ్మవారిని ఉప ఆలయాలను దర్శించుకున్నారు. స్వామి వారి తొలి అభిషేకం తిలకించడానికి కూలైనులో భక్తులు బారులు తీరారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ప్రసాదం అందజేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అళ్లకి రాజగోపాల్‌శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు.

మాండవ్య నారాయణునికి నేడు ప్రత్యేక పూజలు

సామర్లకోట: స్థానిక గోదావరి తీరంలోని పురాతనమైన మాండవ్యనారాయణస్వామికి జన్మ నక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు, స్వామి, అమ్మవార్లకు క్షీరాభిషేకం, విశేష సహస్ర నామార్చనలు జరుగుతాయని ఆలయ ఈఓ బిక్కిన వెంకట్రాయచౌదరి తెలిపారు. ఈ మేరకు చింతా అప్పారావు, లక్ష్మి దంపతులు పూజలు చేయించడానికి ముందుకు వచ్చారన్నారు. అలాగే ఈ నెల 25న పూర్వాభాద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలోని ఆంజనేయస్వామికి క్షీరాభిషేకం, తమపాకులతో సహస్ర సింధూర పూజ చేయనున్నట్టు తెలిపారు. ఈ పూజ జరిపించడానికి బొట్టా సురేష్, కృష్ణవేణి దంపతులు ముందుకు వచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.



సామర్లకోటలోని మాండవ్యనారాయణస్వామి

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

వైద్యాధికారి సౌజన్య

కొత్తపల్లి: వేసవిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని నాగులపల్లి వైద్యాధికారి సౌజన్య అన్నారు. మండలంలోని నాగులపల్లి పీహెచ్‌సీలో సోమవారం వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కువ శాతం నీటిని తీసుకోవాలని, అధిక ఉష్ణోగ్రత, వేడి వల్ల వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందన్నారు. పళ్ల రసాలు, ద్రవ ఆహార పదార్థాలను తీసువాలని సూచించారు. కాటన్ దుస్తులను ధరించాలన్నారు. వైద్య సిబ్బంది స్థానికంగా ఉన్న ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉంటారన్నారు. గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకుంటూ ఎప్పటికప్పుడు వైద్య పరిక్షలను చేయించుకోవాలన్నారు.



గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రెండు మోటారు సైకిళ్లు ఢీ



వ్యాన్ ఈడ్చుకు పోవడంతో తీవ్రంగా గాయపడిన రాయుడు దుర్గాప్రసాద్



రోడ్డు ప్రమాదంలో గాయపడిన దుర్గాడ భీమరాజు దంపతులు

- ఇద్దరికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

సామర్లకోట: స్థానిక సుగర్ ఫ్యాక్టరీ గేటు ఎదురుగా రెండు మోటారు సైకిళ్లు ఢీ కొనడంతో సోమవారం రాత్రి ఇద్దరు గాయపడగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు కథనం ప్రకారం వేట్లపాలెం గ్రామానికి చెందిన దుర్గాడ భీమరాజు మోటారు సైకిల్‌పై భార్యతో కాకినాడ ఆస్పత్రికి వెళుతున్నారు. ఇదే సమయంలో స్థానిక గూడ్స్ షెడ్‌లో విధులు నిర్వహించి మోటారు సైకిల్‌పై వేట్లపాలెం వెళ్తున్న రాయుడు దుర్గప్రసాద్ ఫ్లైవర్ బ్రిడ్జి నుంచి దిగుతూ ఎదురుగా వస్తున్న వారిని ఢీ కొన్నాడు. రెండు మోటారు సైకిళ్లపై ఉన్న వారు కింద పడిపోయారు. ఈ క్రమంలో వేట్లపాలెం నుంచి వాటర్ ప్యాకెట్లు తీసుకుని వెళుతున్న వ్యాన్ కింద పడిపోయిన దుర్గాప్రసాద్‌ను కొంత దూరం ఈడ్చుకుపోయింది. దాంతో దుర్గా ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్సై ఘటనా ప్రదేశానికి చేరుకుని అదే వ్యాన్‌లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి సీఐ ఎ.కృష్ణభగవాన్ దర్యాప్తు చేస్తున్నారు.

మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు

- పట్టించుకోని అధికారులు
- వాతావరణంలో మార్పులతో రైతుల్లో ఆందోళన

సామర్లకోట: ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో సుమారు 60 శాతం ధాన్యం కోతలు పూర్తయినా ధాన్యం కొనుగోలు చేసేవారు కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు నెల రోజుల క్రితమే పీబీ దేవం, జి.మేడపాడు, వేట్లపాలెం గ్రామాల్లో ధాన్యం కోతలు ప్రారంభమయ్యాయి. వీకే రాయపురం గ్రామంలో వరి నాట్లు ఆలస్యం కావడంతో కోతలు ప్రారంభం కాలేదు. మిగిలిన 17 గ్రామాల్లో కోతలు ముమ్మరం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కోనుగోలు చేస్తామని జేసీ ఆర్భాటంగా ప్రకటించారు. జిల్లాలోని రైసు మిల్లుల యజమానులు బ్యాంకు గ్యారెంటీని ప్రభుత్వానికి ఇచ్చారు. అయితే రోజుకు వెయ్యి క్వింటాళ్ల వరకే ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించడంతో ఇద్దరు ముగ్గురు రైతుల ధాన్యంతోనే లక్ష్యం పూర్తయిపోతోంది. ఈ నేపథ్యంలో తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకు ధాన్యాన్ని విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్ ఆరోపిస్తున్నారు. టార్గెట్ తక్కువగా ఉంటే రైతులకు 48 గంటలోనే సొమ్ములు చెల్లించామని చెప్పుకొనే ప్రయత్నంలో భాగమని రమేష్ తెలిపారు. రైతులు ఏ సమయంలో ధాన్యం తీసుకువచ్చినా కొనుగోలు చేసే పరిస్థితి ఉండాలన్నారు. గత 10 రోజులుగా వాతావరణంలో మార్పులతో రైతులు ధాన్యాన్ని కళ్లాల్లోనే ఆరబెట్టి కొనుగోలు కేంద్రాల వద్ద అవకాశం లేకపోతే దళారులకు విక్రయిస్తున్నారని చెప్తున్నారు. ప్రభుత్వం మద్దతు దర రూ.1725 ప్రకటించగా దళారులు రూ.1550కే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని రమేష్ డిమాండ్ చేస్తున్నారు.

● వాహనంపై ఐదుగురు.. సీఐ క్లాస్

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో కాకినాడ నుంచి మోటారు సైకిల్‌పై సామర్లకోట వైపు వస్తున్న ఐదుగురిని మాధవపట్నంలో సీఐ ఎ.కృష్ణభగవాన్ గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆ వాహనంపై ఉన్న ముగ్గురు మహిళలను సీఐ తన వాహనంలో సామర్లకోట బస్సు కాంప్లెక్స్‌కు తీసుకురాగా, మిగిలిన ఇద్దరూ మోటారు సైకిల్‌పై వారిని అనుసరించారు. ఈ మేరకు కాంప్లెక్స్ వద్ద సీఐ వాహనంలో ఉన్న వారిని దింపి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ఉండగా మోటారు సైకిల్ పెట్రోలు ట్యాంకుపై ఒకరితో పాటు ఐదుగురు ప్రయాణిస్తే హ్యాండిల్ ఎలా తిరుగుతుందని, ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని సీఐ వారిని ప్రశ్నించారు. ప్రయాణం సురక్షితంగా జరిగేలా చూసుకోవాలని, వాహనంపై ఇద్దరు మాత్రమే ప్రయాణం చేసి మిగిలిన వారు బస్సులో వెళ్లాలని సూచించారు. తాము బయలుదేరిన ప్రదేశం నుంచి ఎటువంటి వాహనాలు లేక పోవడంతో విధిలేని పరిస్థితిలో తామంతా ఒకే వాహనంపై ప్రయాణించాల్సి వచ్చిందని, ఇక ముందు జాగ్రత్తగా ఉంటామని ఆ కుటుంబ సభ్యులు సీఐకు వివరించారు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, సిబ్బంది పాల్గొన్నారు.



మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఐదుగురికి కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ తదితరులు

ఫ్రీజర్ బాక్స్‌ల బహూకరణ

కాకినాడ రూరల్: భౌతిక కాయాన్ని భద్రపరిచేందుకు అవసమయ్యే ఫ్రీజర్ బాక్స్‌లను దాతలు సమర్పించారు. వీర శైవ ధర్మాన్ని ఆచరించిన జంగమ, లింగాయత్‌ల సౌకర్యార్థం లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఓం నమశ్శివాయ, నాగమణి దంపతులు ఒక ఫ్రీజర్, గ్రామంలోని అన్ని వర్గాల కోసం అయిరెడ్డి సత్యనారాయణ మరో ఫ్రీజర్ ఏర్పాటు చేశారు. వీటిని రమణయ్యపేట శ్మాశన వాటిక వద్ద సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే పంతం నానాజీ ద్వారా అందజేశారు. అంతకు ముందు శ్మాశన వాటికలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్ ఈశ్వర్ కుమార్, మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ, బోళ్ల కృష్ణమోహన్, అడబాల రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాత ఓం నమశ్శివాయ మాట్లాడుతూ ఈశ్వరుని కృపతో లింగధారణ చేసుకుని నిత్యం ఆత్మ లింగ పూజ చేసుకునే జంగమ కులస్తులు వీర శైవ ధర్మాన్ని అనుసరించి వారి సంప్రదాయం ప్రకారం పార్థివ దేహాన్ని కూర్చుబెడతారని అందుకు వీలుగా ఉండేలా ఫ్రీజర్ తయారు చేయించి అందించామన్నారు.

కుట్టు మెషీన్ల పంపిణీ



కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ బాదం బాలకృష్ణ

బాలాజీచెరువు: లయన్స్‌క్లబ్ కాకినాడ హాల్లో స్వయం ఉపాధి నిమిత్తం ఏడుగురు పేద మహిళలకు ఉచితంగా కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. జిల్లా పూర్వపు గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ వీటిని అందజేశారు. ఈ కార్యక్రమలో చాంబర్ ఆఫ్ కామర్స్ పూర్వ అధ్యక్షుడు డేగల చంద్రశేఖర్ (రమేష్), పీవీ కుమార్, జీఎల్ జగన్నాథరావు పాల్గొన్నారు.

చురుగ్గా విద్యార్థుల నమోదు

సామర్లకోట: ప్రభుత్వ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమాలు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో జోరుగా జరుగుతున్నాయి. ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన పెంచుతున్నారు. ఈ కార్యక్రమాలను మండల విద్యాశాఖాధికారులు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య పర్యవేక్షిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం ఎంఈఓ శివరామకృష్ణయ్య హుస్సేన్‌పురం, అచ్చంపేటలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎంఈఓ–2 పి.పుల్లయ్య చంద్రంపాలెం, ఉండూరు గ్రామాలల్లో పర్యటించి ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు హైస్కూల్‌లో చేరేలా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు శివరామకృష్ణయ్య. పి.పుల్లయ్య మాట్లాడుతూ బడి బయట పిల్లలు ఉండటానికి వీలు లేదని, ఈ మేరకు ఉపాధ్యాయులతో పాటు విద్యాశాఖలో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ బడికి వెళ్లని పిల్లలను గుర్తించాలన్నారు. అంగన్‌వాడీ పాఠశాలలో విద్య పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేరేలా ప్రయత్నించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యతో పాటు అనేక మౌలిక సదుపాయాలు, విశాలమైన క్రీడా మైదానాలు ఉన్నాయన్నారు. ప్రతి విద్యార్థికి మూడు జతల యూనిఫాం, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలతో పాటు బ్యాగ్, బూట్లు ఉచితంగా ఇస్తారన్నారు. ఈ కార్యక్రమాల్లో ఈఓపీఆర్డీ భైరవమూర్తి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, విద్యా కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హుస్సేన్‌పురం అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు ఒకటో తరగతిలో చేరడానికి అనుమతి పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య, ఈఓ పీఆర్డీ తదితరులు

మాలల మహా రణభేరిని విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

పిఠాపురం: రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పీవీ రావు 73వ జయంతి కార్యక్రమం, మాలల మహా రణభేరి వర్గీకరణను వ్యతిరేకిద్దాం రాజ్యాంగాన్ని రక్షించుకుందాం నినాదంతో కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో వచ్చే నెల 12వ తేదీ నిర్వహించబోయే బహిరంగ సభకు మాల, మాల ఉప కులాలవారు అధిక సంఖ్యలో పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం పిఠాపురంలో కాకినాడ జిల్లా మాల జేఏసీ నాయకులు, బీఎస్పీ నాయకులు ఖండవల్లి లోవరాజు ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పచ్చిమళ్ల అప్పలరాజు, ఇరుగుల పవన్, పెదపాటి రాజేష్, కూసి యేసు, దిమ్మల అప్పారావు, బుల్లిపే రమణ, మాత నాగేశ్వరరావు, గుర్రాల యేసు రత్నం, పెదపాటి కృష్ణ, సాకా వినయ్, సారిక శ్రీధర్, బల్లా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లరు చెప్పినదే ధర

- ధాన్యం కొనుగోళ్లలో మాయాజాలం
- మద్దతు ధర రూ.25 తగ్గింపు
- రైతుల నిరసనతో దిగివచ్చిన అధికారులు

కరప: రబీ ధాన్యాన్ని మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారుల ప్రకటనలు ఆచరణలో కన్పించడం లేదు. మిల్లరు చెప్పిన ధరకు ఇవ్వలేక రైతులు నష్టపోతున్నారు. కరప మండలం గొర్రిపూడిలో పరిస్థితి ఇలా ఉంది. గ్రామానికి చెందిన జల్దాని వీరబాబు, కటకం బుజ్జిబాబు, పుణ్యమంతుల సూర్యనారాయణ, ఎర్రంనీడి తాతీలు పండించిన ధాన్యాన్ని రైతు సేవాకేంద్రానికి తీసుకెళ్లారు. తేమశాతం, ఇతర రకాలు పరీక్షించి నడకుదురులోని ఒక రైస్ మిల్లుకు ఎఫ్‌టీఓ రశీదు ఇస్తామన్నారు. సాధారణ రకం ధాన్యానికి కనీస మద్దతు ధర 75 కిలోల బస్తాకు రూ.1725 ఉంది. అయితే మిల్లరు బస్తాకు రూ.25 తగ్గించి తీసుకుంటామని అలాగైతేనే రండి అని చెప్పారు. దీంతో రైతులు ధాన్యం ట్రాక్టర్‌ను సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చి తహసీల్దార్ ఎస్.సత్యనారాయణకు మిల్లర్ చెప్పిన విషయాన్ని వివరించారు. ఆయన డీఎస్ఓ, ఎంఏఓ ఏవీ రాజేష్‌తో సంప్రదించి ధాన్యం నిబంధనలకు లోబడి ఉన్నాయా, లేదా అని ఆరాతీశారు. కరప ఏఈఓ ప్రశాంత్, గొర్రిపూడి వీఏఏ పవన్‌లను కార్యాలయానికి పిలిపించి ధాన్యాన్ని పరీక్ష చేయించారు. నిబంధనలకు లోబడి ఉండటంతో మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సత్యనారాయణ రైతులకు సర్ది చెప్పారు. గొర్రిపూడి రైతు సేవాకేంద్రం నుంచి సదరు ధాన్యానికి ఎఫ్‌టీఓ రశీదు రాయించి, రైసుమిల్లుకు తరలించారు.



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న రైతులు